సాక్షి

గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

గురువారం । 28 । మార్చి । 2024



బడికి పోయినా బతికెటోడు..

ఎండుమిర్చి విక్రయించేందుకు తండ్రితో కలిసి వెళ్లిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

- 8లో▸



ప్రగతి పథంలో డీసీసీబీ

వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రగతి పథంలో దూసుకెళ్తోందని బ్యాంకు చైర్మన్ రవీందర్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
39^{0}/24^{0}

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. అధిక వేడిమి ఉంటుంది. రాత్రి ఉక్కపోత ఎక్కువవుతుంది.



న్యూస్‌రీల్

నేడు బార్ అసోసియేషన్ల ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఎన్నికలు నేడు (గురువారం) జిల్లా కోర్టు ప్రాంగణంలో జరుగుతాయని ఎన్నికల నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో వరంగల్ బార్ అసోసియేషన్ తరఫున 720 మంది, హనుమకొండ బార్ అసోసియేషన్ తరఫున 900 మందికి పైగా న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు.

రుద్రేశ్వరుడికి సీపీ పూజలు



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో.. అర్చకులు సీపీని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం సీపీ అంబర్ కిశోర్‌ఝా, ఆయన బంధువులు గణపతిని దర్శించుకుని, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, మారేడు దళ బిల్వార్చన నిర్వహించారు. ఉపేంద్రశర్మ వారికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

న్యూశాయంపేట: యూపీఎస్సీ-సీ-శాట్-2025 పరీక్ష కోసం ప్రిపేరవుతున్న నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైనులు, పార్సీ) అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి, హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే కోచింగ్ కోసం సివిల్స్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష రాయడానికి తమ దరఖాస్తుల్ని www.tmreistelangana.cgg.gov.in, డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.టిమ్రీస్‌తెలంగాణ.సీజీజీ.జీవోవీ.ఇన్‌లో ఏప్రిల్ 12లోగా అందించాలని కోరారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయాల్లో లేదా.. 040-23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేయూ పాలక మండలి సమావేశం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఇందులో.. కేయూ స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను, వార్షిక నివేదికను, అకడమిక్ సెనేట్ బడ్జెట్‌కు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై చర్చించి ఆమోదించారు. 2024-25 కేయూ అంచనాల బడ్జెట్‌పై కూడా పాలకమండలి సమావేశంలో ఆమోదించినట్లు సమాచారం. తొలుత ఫైనాన్స్ కమిటీ సమావేశం సైతం జరిగినట్లు తెలిసింది. ఈపాలక మండలి సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రెటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేశ్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొనగా.. ఫైనాన్స్ కమిటీ సమావేశంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య పాల్గొన్నారు. కాగా.. ఈనెల 30న కేయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో ఉదయం 11 గంటలకు అకాడమిక్ సెనేట్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో కేయూ వార్షిక నివేదికతోపాటు, బడ్జెట్ కూడా ప్రవేశపెట్టనున్నారు.

పొలిటికల్ హీట్

ఎంపీ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలు

- ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలతో హడావుడి
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిపై ఉత్కంఠ.. ఢిల్లీలో ముగిసిన పీఈసీ, సీఈసీ భేటీ
- నేడో, రేపో అభ్యర్థి ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన రాజకీయాలు



సాక్షిప్రతినిధి, వరంగల్ :

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఉమ్మడి వరంగల్‌లో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. కొత్త ఒరవడితో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలను అమలు చేసే పనిలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఇప్పటికే.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. వరంగల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. మానుకోట నుంచి పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్), మాలోతు కవిత(బీఆర్‌ఎస్), అజ్మీరా సీతారాంనాయక్ (బీజేపీ) తలపడనుండగా.. వరంగల్ కోసం బీజేపీ నుంచి అరూరి రమేశ్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య బరిలో నిలవనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ కోసం అరడజను మంది తీవ్రంగా ప్రయత్నం చేస్తుండగా.. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన సీఈసీ సమావేశం ముగిసే సమయానికి దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర, నమిండ్ల శ్రీనివాస్ మధ్య టికెట్ పోటీ ఉన్నట్లు సమాచారం. నేడో, రేపో వరంగల్ అభ్యర్థిని ప్రకటించేందుకు టీపీసీసీ సిద్ధమైనట్లు పార్టీ వర్గాల సమాచారం.

ఎవరి వ్యూహం వారిదే..

వరంగల్, మానుకోట స్థానాల్లో ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు పార్టీలో చేరగా.. ఇతర పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపరిచే పని మొదలు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలూ మొదలు పెట్టారు. పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం చేరికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉమ్మడి వరంగల్‌లో జాతీయ నాయకులతో బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రణాళికలు.. ఎత్తుగడలు

ఇద్దరు బీఆర్‌ఎస్ కీలక నేతలైన అజ్మీరా సీతారాం నాయక్, అరూరి రమేశ్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ.. ఈసారి ఈ రెండు ఎంపీ సీట్లను కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది.

ఇక బీఆర్‌ఎస్.. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురైనా.. లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్ర నాయకత్వం భరోసా ఇస్తోంది. కాన్ఫరెన్స్‌లు, సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా..

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. వరంగల్, మానుకోట లోకసభ స్థానాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో సమన్వయ కమిటీలు, మండలాలు, గ్రామాల్లో ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోదీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి సూచిస్తోంది. ఇలా ప్రధాన పార్టీల వ్యూహాలతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

'స్వీప్'ను పటిష్టంగా అమలు చేయాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్/వరంగల్ అర్బన్ : ఓటర్లను చైతన్యపరిచేందుకు స్వీప్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో స్వీప్ కార్యక్రమాల కార్యాచరణపై సంబంధిత నోడల్ అధికారులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన అర్బన్, రూరల్ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఓటర్లను ఆకర్షించే విధంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు ఓటర్లుగా నమోదు చేసుకోని వారు ఏప్రిల్ 15లోగా నమోదు చేసుకోవాలని, ఇందుకు ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేలా మహిళా సమాఖ్యలు, స్లమ్ లెవల్, టౌన్ లెవల్ సమాఖ్యల ద్వారా అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు. ప్రతీ గడపకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని వివరించారు. సమావేశంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీపీఆర్‌ఓ అయూబ్‌అలీ, డీఈఓ వాసంతి, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహమూర్తి, డీపీఓ కల్పన, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి బల్దియాలోని మెప్మా కార్యాలయంలో తెలుగుతల్లి పట్టణ సమాఖ్య సభ్యులకు ఓటు చైతన్యంపై నిర్వహించిన స్వీప్-2024 అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ కోలా రాజేష్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేష్, యూబీ మేనేజర్ సంజీవ్, సీఓలు రజిత, రమ, నాగరాజు, ప్రవీణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నోడల్ అధికారుల పాత్ర కీలకం

కరీమాబాద్ : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, సంధ్యారాణితో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సిబ్బంది సమన్వయంతో నివేదికలు సేకరించి ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తయినందున పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించాలని, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీ రవీందర్, డీఆర్వోలు శ్రీనివాస్, గణేష్, ఆర్డీఓలు దత్తు, కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

హన్మకొండ అర్బన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) పనితీరుపై కలెక్టరేట్‌లో సెక్టార్ అధికారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. జిల్లాలోని సెక్టార్ అధికారులు పోలింగ్ తేదీన ఈవీఎంల నిర్వహణ, వాటి పని తీరు, వివిధ అంశాలపై మోడల్ ఈవీఎంల (కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్) తో నిపుణులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు మాక్ పోల్ మొదలుకొని, పోలింగ్ అనంతరం సెక్టార్ అధికారులు నిర్వర్తించే విధుల గురించి ట్రైనర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేశ్, మాస్టర్ ట్రైనర్లు భాస్కర్‌రెడ్డి, రవి, రాంబాబు, పృథ్వీ, శివకోటి, శ్రీధర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల పని తీరుపై సెక్టార్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు

'టెట్' అర్హత లేకుండా పదోన్నతులివ్వాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

విద్యారణ్యపురి: తెలంగాణలో ఉపాధ్యాయులకు టెట్ అర్హత లేకుండానే.. పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలో ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా.. విద్యా రంగానికి ఒనగూరిందేమీ లేదన్నారు. టెట్‌ను ప్రామాణికంగా తీసుకుంటే ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని లేదా.. నిర్ణీత కాల పరిమితిని నిర్ణయించి ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23న రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిదేళ్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకపోవడం ప్రభుత్వాల వైఫల్యమేనని అన్నారు. ఏళ్ల తరబడి ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులున్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేయబోతున్న ఉపాధ్యాయులకు సర్వీస్ బెనిఫిట్స్ త్వరితగతిన చెల్లించాలన్నారు. పాఠశాలల్లో సర్వీస్ వర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని అందుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తమ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపకపోతే.. టీపీటీఎఫ్ వివిధ రూపాల్లో ఉద్యమ కార్యాచరణ చేయనున్నదని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ బాధ్యులు సన్నెబోయిన తిరుపతి, రావుల రమేశ్, గుంటి ఎల్లయ్య, పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహరరాజు, దర్శిని మాజీ సంపాదకులు బైరి స్వామి, టీపీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎం.రఘుపతి, జి.వెంకటేశ్వర్లు, మాజీ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రమేశ్, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీరామ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జగపతిరావు, హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు ఇతర బాధ్యులు, టీపీటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్పాట్' రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కాశోజీ సెంటర్ : పదో తరగతి స్పాట్ వ్యాల్యూయేషన్ రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత ఆధ్వర్యంలో నాయకులు డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన స్పాట్ వ్యాల్యూయేషన్ రెమ్యునరేషన్ ఈ ఏడాది స్పాట్ వ్యాల్యూయేషన్ కంటే ముందే చెల్లించాలని, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, రిటైర్డ్ కానున్న ఉపాధ్యాయులకు వ్యాల్యూయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ఎం.సర్వేశ్వర్, ఎం.నవీన్ కుమార్, జె.సునీల్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన హోంగార్డు

- పోలీసు అధికారులు, ప్రజల అభినందనలు



సోనును కాపాడిన తర్వాత అతడితో మాట్లాడుతున్న ట్రాఫిక్ హోంగార్డు రవి

రామన్నపేట : వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన ఓ యువకుడిని బుధవారం వరంగల్ ట్రాఫిక్ హోంగార్డు వై.రవి కాపాడారు. వివరాల్లోకి వెళ్లితే.. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన హితోవ సోను అనే వ్యక్తి నగరంలో పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతను చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అండర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపైకి వెళ్తుండగా గమనించిన కొందరు కేకలు వేశారు. బ్రిడ్జి కూడలి వద్ద ట్రాఫిక్ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రవి వెంటనే పట్టాల పైకి చేరుకుని సోనును పక్కకు లాగి ప్రాణాలు కాపాడాడు. ఇందుకు సంబంధించిన వీడియో సైతం వాట్సప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. ప్రాణాలు కాపాడిన హోంగార్డు రవిని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, స్థానికులు అభినందించారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్ : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. తాగునీటి సరఫరాపై 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నీటి సరఫరాకు సంబంధించి పురోగతిలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని తాగునీటి బోర్లు, చేతిపంపులు, మోటార్లు, పైపులైన్ల మరమ్మతు పనులు, మిషన్ భగీరథ నీటి సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు ఇ.సునీత, శ్వేత, చంద్రునాయక్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని నిర్లక్ష్యం చేయొద్దు

- పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా



రామప్ప సరస్సును పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా

హసన్‌పర్తి: వేసవి కాలంలో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.. ప్రజల దాహార్తిని నిర్లక్ష్యం చేయొద్దని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఎండల తీవ్రత పెరగడంతో వాగులు, గోదావరి నదిలో నీటి నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో ఆయన బుధవారం ములుగు జిల్లాలోని రాంనగర్, పూసూరు, రామప్పలోని ఇంటెక్ వెల్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సందర్శించారు. మొదట ఏటూరునాగారం మండల పరిధి రాంనగర్ ఇంటెక్ వెల్‌ను సందర్శించిన ఆయన.. మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ నుంచి తాగునీరు ఎంత వస్తోంది.. అన్ని గ్రామాలకు సరిపోతున్నదా? అనే అంశాలు తెలుసుకున్నారు. అనంతరం వాజేడు మండల పరిధిలోని పూసూరు గోదావరి వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్‌ను పరిశీలించారు. వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని రామప్ప సరస్సులోని ఇన్‌టేక్ వెల్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రాత్రి వరకు హసన్‌పర్తిలోని మిషన్ భగీరథ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ జిల్లాలకు చెందిన అధికారులతో సందీప్‌కుమార్ సుల్తానియా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, వరంగల్, మహబూబాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, లలిత, ఎస్‌ఈ మల్లేశం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకంత ప్రేమ..!

ప్రైవేట్ యాడ్ ఏజెన్సీల పన్ను వసూళ్లపై ఉదాసీనత

- లక్ష్యం రూ.1.69 కోట్లు..
- వసూలైంది రూ.30.75 లక్షలే..
- మిగిలింది నాలుగు రోజులే
- బల్దియా అధికారుల తీరుపై విమర్శలు



నగర ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్

వరంగల్ అర్బన్: అభివృద్ధి పనులు మొదలు పెట్టాలన్నా.. బిల్లులు చెల్లించాలన్నా.. చిరు ఉద్యోగులకు వేతనాలివ్వాలన్నా నిధులు లేవని సమాధానం చెప్పే బల్దియా.. తనకు రావాల్సిన సొంత ఆదాయంపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. పేద, మధ్య తరగతి వర్గాలు ఆస్తి పన్ను కట్టకపోతే నానాయాగీ చేసే అధికారులు.. యాడ్ ఏజెన్సీలు ప్రకటనల పేరిట రూ.1.69 కోట్ల డిమాండ్‌కు గాను రూ.30.75 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇంకా అధిక మొత్తంలో.. బకాయిలున్నా పట్టించుకోవడం లేదు. నాలుగు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. అయినా.. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిలో కదలిక లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకటనల పన్నులూ కీలకమే..

గ్రేటర్ వరంగల్ ఆదాయ మార్గాల్లో ప్రకటనల పన్నులు కీలకమే. విద్య, వ్యాపార, వాణిజ్య కేంద్రంగా వెలుగొందుతున్న మహా నగరంలో, విలీన గ్రామాల్లో ప్రకటనల హోర్డింగ్‌లు పెరిగిపోతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, విద్యా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ఆస్పత్రులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నాయి. దీనికి అనుమతి తీసుకునే విషయంలో కొన్ని ఏజెన్సీలు బల్దియా ఆదాయానికి గండికొడుతున్నాయి. నగరంలో వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి సైన్ బోర్డులు, యాడ్ ఏజెన్సీల నుంచి పన్నులు వసూలు చేసేందుకు ఉన్నతాధికారి రోజువారీ లక్ష్యాలను ఖరారు చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పన్ను వసూళ్ల గురించి పట్టించుకోవడం లేదు. టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారి ఇంత వరకు వసూళ్లపై క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించకపోవడం గమనార్హం.

ప్రకటనలు ఎక్కువ.. ఆదాయం తక్కువ

ఆదాయం పెంచుకునేందుకు నగరంలో ప్రకటనల ద్వారా అనేక మార్గాలున్నాయి. రాష్ట్రంలో పేరు మోసిన యాడ్ ఏజెన్సీల ఆఫీస్‌లు ఇక్కడ ఉన్నాయి. ఆదాయం పెంచుకునేందుకు మాత్రం బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా ఎలాంటి ప్రణాళిక లేదు. తమ జేబులు నింపే భవన నిర్మాణ అనుమతులు జారీ, అనధికారిక నిర్మాణాల నుంచి వసూళ్లపై అధికంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారనే విమర్శలున్నాయి. నగరంలో ఎన్ని హోర్డింగ్‌లున్నాయి. అందులో అధికారికంగా ఎన్ని? అనధికారికంగా ఎన్ని ఏర్పాటు చేశారని లెక్కించి చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడనే ఆరోపణలున్నాయి. ఫ్లెక్సీలు, కదిలే వాహనాలు బస్సులు, ప్రైవేట్ నాలుగు చక్రాల వాహనాలు, వ్యాన్లు, ఆటోల ద్వారా ఆదాయం సమకూర్చుకునే వీలుంది. కానీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా బల్దియా అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో.. హోర్డింగ్‌ల ద్వారా రూ.1.69కోట్లు వస్తాయని బల్దియా అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు రూ.30.75 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.1.38కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

గడువులోగా పన్నుల లక్ష్యం చేరుకోవాలి

- పురపాలక శాఖ డైరెక్టర్ దివ్య దేవరాజన్

వరంగల్ అర్బన్: నిర్దిష్ట గడువులోగా ఆస్తి, నీటి పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఈఈ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశ్విని తానాజీ వాకడే

క్లుప్తంగా

అమెరికాలో వీఎస్‌ఆర్ నగర్ వాసి మృతి

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మహేష్
- ఆఫీస్‌లో డ్యూటీ చేస్తుండగానే గుండెపోటు


మహేష్ (ఫైల్)

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామానికి చెందిన చిట్టోజు మహేష్(34) అమెరికాలో గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. చిట్టోజు ప్రమీల, మదనాచారి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మహేష్ హైదరాబాద్‌లోని నాగారంలో స్థిరపడ్డాడు. మూడేళ్ల క్రితం ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన అతను జార్జియాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం మహేష్ డ్యూటీలో ఉండగా గుండె పోటు రావడంతో తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేష్‌కు భార్య రాధ, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కాగా, మృతదేహం అమెరికా నుంచి ఇండియాకు రావడానికి ఐదు రోజుల సమయం పడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసు అధికారి ఫొటో డీపీ పెట్టి వసూళ్లకు యత్నం


హెల్ప్ కాల్ బేటా అని మెసేజ్ పంపిన సైబర్ నేరగాళ్లు

మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మహబూబాబాద్ మండలం రేగడి తండా గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఏకంగా ఓ పోలీసు ఉన్నతాధికారి ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి తనకు డబ్బులు పంపాలని కోరాడు. అయితే దీనిపై అనుమానం వచ్చిన సదరు యువకుడు డబ్బులు పంపకుండా ఆ మెసేజ్ గురించి ఆరా తీసి మోసమని గ్రహించాడు. ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. కాగా, సైబర్ మోసాలపై పోలీసు ఉన్నతాధికా రులు ప్రత్యేక దృష్టి సారించి ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

బడికి పోయినా బతికెటోడు..

రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి
- తండ్రికి తీవ్ర గాయాలు
- పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబీకులు

పాపం.. ఆ చిన్నారి బడికి పోయినా బతికెటోడు. మాయదారి మృత్యువు మాటువేసి కాటువేసింది. పాఠశాలకు వెళ్లకుండా చిన్నారిని ఏమర్చి తండ్రితో వస్తాయని మారం చేయించింది. ఈ విషయంలో తండ్రితో కూడా సరేననిపించి చివరకు రోడ్డు ప్రమాద రూపంలో అమాంతం బలితీసుకుంది. ఫలితంగా ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది.


తమ్ముడు,చెల్లితో ఈశ్వర్. (సర్కిల్‌లో ఉన్న బాలుడు)


ఈశ్వర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

జనగామ : ఎండు మిర్చిని విక్రయించేందుకు తండ్రితో కలిసి వెళ్లిన కొడుకు.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం రఘునాథపల్లి మండలం నక్కబొక్కలతండా శివారు సోమయ్య కుంట తండాకు చెందిన గుగులోత్ తిరుపతి, గంగా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. తిరుపతి తన సొంత ఆటోలో ఎండు మిర్చితో పాటు సీజనల్ వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఊరూరా తిరిగి ఎండు మిర్చి విక్రయించేందుకు బయలుదేరగా.. పెద్ద కుమారుడు ఈశ్వర్ (07) తండ్రితో వెళ్తానని మారం చేయడంతో వెంట తీసుకెళ్లాడు. పటేల్ గూడెంలో ఎండు మిర్చి అమ్ముకుని... పెంబర్తి కాకతీయ కళాతోరణం సమీపంలో ఆలేరు వైపునకు యూటర్న్ చేసుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు.. ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో తండ్రితో కలిసి ముందు సీటులో కూర్చున్న ఈశ్వర్ అక్కడిక్కడే మృతి చెందగా.. తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అదే కారులో ఈశ్వర్‌తో పాటు తిరుపతిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించగా, తండ్రికి వైద్య పరీక్షలు చేశారు. కాగా, తమ కుమారుడు మృతి చెందాడని తెలియగానే తల్లిదండ్రులు కుప్ప కూలిపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకోవడంతో రోదనలు మిన్నంటాయి. జిల్లా కేంద్రంలోని అరబిందో స్కూల్‌లో ఒకటో తరగతి చదువుకుంటున్న ఈశ్వర్.. బడికి వెళ్లినా బతికెటోడేమోనంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా .. 16 మందికి గాయాలు

- బుట్టాయిగూడెం వద్ద ఘటన
- ఏటూరునాగారం, ములుగు ఆస్పత్రులకు తరలింపు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల పరిధి బుట్టాయిగూడెం మూలమలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడడంతో అందులోని మిర్చి కూలీలు గాయపడ్డారు. బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు సమీపాన ఉన్న మిర్చి తోటలో మిరప కాయలు ఏరడానికి ట్రాక్టర్‌లో వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో తమ గ్రామ సమీప మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. అందులోని కూలీలు రోడ్డు పక్కన ఉన్న లోయలో ఒకరిపై ఒకరు పడిపోవడంతో కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కొంత మందికి తలలకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో సూరికాని బక్కక్క, సునారికాని మైసక్క, కావిరి బైరేష్, సునారికాని ఆశయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి వైద్యులు తెలిపారు. గాయాలైన జనగాం ఎర్రక్క, కావిరి బక్కక్క, జనగాం సూరక్క, సునారికాని కుమ్మరి సమ్మయ్య, కావిరి ఎల్లక్కలతోపాటు పలువురు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.




క్షతగాత్రులు కావిరి ఎల్లక్క, సమ్మయ్య, బాబు,సూరక్కను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

గేదెను తప్పించబోయి..

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు
- డ్రైవర్ మృతి...మరో డ్రైవర్‌కు గాయాలు
- హసన్‌పర్తిలో ఘటన


బానోత్ మోహన్ (ఫైల్)

హసన్‌పర్తి: గేదెను తప్పించబోయి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. ఈ ప్రమాదం హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి హసన్‌పర్తిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మాటంపల్లికి చెందిన డ్రైవర్ బానోత్ మోహన్ సిమెంట్‌లోడ్ లారీతో మంగళవారం సూర్యాపేట నుంచి రామగుండం వైపునకు బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున హసన్‌పర్తిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపై సేదదీరిన గేదెను తప్పించబోయి అదుపు తప్పి మంచిర్యాల నుంచి నల్లగొండ వైపునకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో బానోత్ మోహన్ తల నుజ్జునుజ్జు అయి అందులోనే ప్రాణాలు వదిలాడు. ఫ్లైయాష్ లోడ్‌తో నల్లగొండ వైపునకు వెళ్తున్న మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన లారీడ్రైవర్ మనోహర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు. లారీలో చిక్కుకున్న మోహన్ మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీశారు.


సంఘటన స్థలంలో లారీలు

పది గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం

ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. పది గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

ఆయుర్వేద మందులు సీజ్



హసన్‌పర్తి: భీమారంలో ఆయుర్వేద మందు నిల్వలపై బుధవారం రాత్రి పోలీసులు దాడులు చేసి సీజ్ చేశారు. భీమారానికి చెందిన ఓ రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి కొంత కాలంగా ఆయుర్వేద మందులు కొంటూ నిల్వ ఉంచుతున్నాడు. ఈక్రమంలో ఇటీవల తన ఇంటిని ఓ ఆస్పత్రికి అద్దెకిచ్చాడు. ఆతర్వాత కొన్నాళ్లకు తాను ఆస్పత్రికి అద్దెకివ్వనని క్లినిక్‌కు తాళం వేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు యజమానిని విచారించేందుకు పోలీసులు రావడంతో ఇంట్లోని ఓ గదిలో పెద్ద ఎత్తున ఆయుర్వేద మందులు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఆమందులను సీజ్ చేశారు. కాగా.. జిల్లా వైద్యాధికారుల సంప్రదించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

డోర్నకల్: కుటుంబ కలహాల నేపథ్యంలో సీరోలు మండలం మోదుగగడ్డతండాకు చెందిన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు కథనం ప్రకారం తండాకు చెందిన గుగులోత్ రాజేశ్వరి(33) ఐకేపీ వీఏఓగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరగగా క్షణికావేశంలో రాజేశ్వరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తప్పుడు ప్రకటనలపై జాగ్రత్తగా ఉండాలి

- ఆయుష్ ఆర్‌డీటీ రవినాయక్


మాట్లాడుతున్న రవినాయక్

కాశిబుగ్గ: ఆయుర్వేదం గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలపై వైద్యులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవి నాయక్ పేర్కొన్నారు. బుధవారం లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఫ్యాకల్టీ, వైద్యులు, సిబ్బందికి 'ఫార్మకోవిజిలెన్స్' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం ఎక్కువ అవుతున్న ఈ రోజుల్లో అనేక ఆయుర్వేద కంపెనీలు వివిధ మందుల రూపంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నాయన్నారు. దీనిపై వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉంటూ వాటిపై ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మావతి, అకడమిక్ అధికారి వాసంతి, ప్రొఫెసర్లు రవీందర్‌గౌడ్, రమేష్‌బాబు, సిరాజుద్దీన్, సులోచన, దుర్గాబాయి, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్పీఎఫ్ పీసీఎస్‌సీ అరోమాసింగ్ ఠాకూర్


మాట్లాడుతున్న అరోమాసింగ్ ఠాకూర్

కాజీపేట రూరల్/కాశిబుగ్గ : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీస్ సిబ్బంది, అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్(పీసీఎస్‌సీ) అరోమాసింగ్ ఠాకూర్ అన్నారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ తనిఖీ నిమిత్తం బుధవారం వచ్చిన అరోమాసింగ్‌ఠాకూర్‌కు స్థానిక ఆర్పీఎఫ్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో నిర్వహించిన సురక్ష సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు, అధికారులు ప్రయాణికుల విషయంలో మర్యాదగా ఉండడంతోపాటు వారికి భద్రత కల్పించాలన్నారు. క్రైమ్ రేట్ తగ్గించాలని పేర్కొన్న ఆమె విధుల విషయంలో పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం అరోమాసింగ్‌ఠాకూర్ కాజీపేట ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి క్రైమ్ రేట్, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ డాల్ బెహర, కాజీపేట ఆర్‌పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు, వరంగల్ సీఐ కృష్ణ, కాజీపేట ఎస్సై రాజన్న పాల్గొన్నారు.

వరంగల్ ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ..

వరంగల్ రైల్వే స్టేషన్‌లోని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) స్టేషన్‌ను అరోమా సింగ్ ఠాకూర్ తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్ మొత్తం కలియ తిరుగుతూ భద్రతా చర్యలు పరిశీలించారు. అలాగే స్టేషన్‌లోని రికార్డులు, క్రైమ్ వివరాలు, సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. రైల్లో గంజాయి, నిషేధిత, అలాగే ఫైర్‌కు సంబంధించిన వస్తువులు తరలించడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఆర్‌పీఎఫ్ డీఎస్పీ ప్రఫుల్‌కుమార్ దల్బెరా, సీఐ టీఎస్‌ఆర్.కృష్ణ ఉన్నారు.

రామప్పను సందర్శించిన అరోమాసింగ్ ఠాకూర్

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని రామప్ప దేవాలయాన్ని పీసీఎస్‌సీ అరోమాసింగ్ ఠాకూర్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఆమెకు ఆలయ పూజారి ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పాకళాసంపద అద్భుతంగా ఉందని అరోమాసింగ్‌ఠాకూర్ అన్నారు.

దేవాదాయ భూములకు పట్టా పుస్తకాలు

- పార్టీలో పాత కొత్త భేదాలు ఉండవు
- పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీని గెలిపించుకుందాం
- క్యాంపు కార్యాలయంలో కొండా దంపతులు


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కాశిబుగ్గ : రాష్ట్రంలోని దేవుడి మాన్యాలు ఆక్రమణకు గురవుతున్నాయి.. వాటిని సర్వే చేయించి పట్టా పాస్ పుస్తకాలలో రికార్డు చేయించి దేవాలయాలకు అప్పగిస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వరంగల్ ఓ సిటీలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి భర్త కొండా మురళీధర్‌రావుతో కలిసి గృహ ప్రవేశం చేశారు. అనంతరం సమావేశంలో మంత్రి కొండా దంపుతులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఖిలా వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. దేవాలయాల భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని, ఇందుకు ఫారెస్ట్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

నాయకులు, కార్యకర్తలు రెండు కళ్లు..

పార్టీలో నాయకులు, కార్యకర్తలు తమకు రెండు కళ్లు అని.. కొత్త పాత అనే తేడా లేదన్నారు. మీరు కూడా ఎలాంటి పొట్లాటలకు దిగకుండా కలసికట్టుగా పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసి తూర్పులో తన కంటే ఎక్కువ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. 'మీరు కష్టపడితేనే మేము ఈస్థాయిలో ఉన్నాం.. అందరికీ న్యాయమే చేస్తాం.. లీడర్లు కూడా అన్యాయంగా ఉండే పైరవీలు తీసుకు రావొద్దు.. నిస్వార్థంగా పని చేసి మంచి పేరు తీసుకురావాలి.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొండా మరళి పోటీలో ఉంటారు' అని సురేఖ తెలిపారు. యువత, మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుమార్తె సుస్మితా పటేల్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్‌కు తోడ్పాటు చేయబోతున్నదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఇతర విషయాలపై వాస్తవ పరిస్థితులను మీడియా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

త్వరలో బొందివాగు ప్రాజెక్టు

హంటర్‌రోడ్ తదితర ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి బొందివాగు ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. తూర్పు ప్రజలకు త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు నాయకులు మహ్మద్ అయూబ్, మీసాల ప్రకాశ్, దాసరి రాజేష్, కూచన రవీందర్, సందెల లాజర్ తదితరులు పాల్గొన్నారు.

'మెగా' వద్ద వేయి కోట్ల ముడుపులు

వరంగల్: 'మెగా' కాంట్రాక్ట్ ఏజెన్సీ వద్ద బీజేపీ రూ.వేయి కోట్ల ముడుపులు తీసుకున్నందునే కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఆ పార్టీ నేతలు నోరు మెదపడం లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. గృహప్రవేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేసిన అవినీతి అక్రమాలను కాంగ్రెస్ పార్టీ బయట పెట్టినా.. కేంద్రంలోని బీజేపీ నాయకులు పట్టించుకోవడం లేదని, అది ఆ రెండు పార్టీ మధ్య జరిగిన రహస్య ఒప్పందం వల్లే అని ఆరోపించారు.

పరిశోధనలో ఎస్‌పీఎస్‌ఎస్ ఉపయోగం

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

విద్యారణ్యపురి: పరిశోధకులు తమ పరిశోధనలు క్రమబద్ధంగా వెల్లడించాలంటే డేటా అనాలిసిస్‌కు స్టాటిస్టికల్ ప్యాకేజీ ఫర్ సోషల్‌సైన్సెస్ (ఎస్‌పీఎస్‌ఎస్) ఎంతో ఉపయోగపడుతుందని కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాలలో రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యజీవితంలో కూడా డేటా అనాలిసిస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రాజారెడ్డి మాట్లాడుతూ ఈ జాతీయ వర్క్‌షాప్ పరిశోధకులు, విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి, వర్క్‌షాప్ కన్వీనర్ ఐ మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుహాసిని, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి పార్వతి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, కోకన్వీనర్ జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి మాధవి, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసుపై పోలీసుల ప్రత్యేక దృష్టి


విజయ (ఫైల్)

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో గత సంవత్సరం డిసెంబర్ 14న జరిగిన వృద్ధురాలు కన్నె విజయ హత్య కేసుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు నానాటికి సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో కాజీపేట ఏసీపీ తిరుమల్ రావు.. వృద్ధురాలి హత్య కేసు చేధించడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా కొద్ది రోజుల నుంచి ఘటనా స్థలిని తరుచూ సందర్శిస్తూ హత్య పరిణామాలు, కాలనీ పరిసరాలను పరిశీలిస్తున్నారు. రహమత్ నగర్ కాలనీతో పాటు ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. హత్య జరిగిన రోజు కాలనీకి రాకపోకలు సాగించిన వాహన యజమానుల జాబితాతో పాటు అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు. ఏసీపీ తిరుమల్ రావు పర్యవేక్షణలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, శివకృష్ణ, సునీల్ కుమార్‌తో పాటు సిబ్బంది కేసును సవాల్‌గా తీసుకుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఏసీపీ తిరుమల్ రావు మంగళవారం రాత్రి దాదాపు 6 గంటల పాటు సిబ్బందికి దిశానిర్దేశం చేశారంటే కేసు పరిష్కారానికి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

ప్రగతి పథంలో వరంగల్ డీసీసీబీ

- చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) ప్రగతి పథంలో దూసుకెళ్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మహాజన సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రూ.860 కోట్లు ఉన్న డీసీసీబీ టర్నోవర్ రూ.1893 కోట్లకు చేరుకుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల లాభం సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత లాభం పెరుగుతుందన్నారు. దేశంలోనే అత్యధికంగా రూ.350 కోట్ల రుణాలు ఇచ్చి జాతీయ స్థాయి అవార్డు పొందినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70వ ప్రాథమిక సహకార సంఘాలుండగా 50 సంఘాలకు వరంగల్ డీసీసీబీ ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. మిగతా 20 సంఘాలకు వాణిజ్య బ్యాంకులు అందిస్తాయన్నారు. డీసీసీబీ సాయంతో నడుస్తున్న 50 సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. డీసీసీబీలో డిపాజిట్లు రూ.503 కోట్లకు చేరాయన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మహాజన సభలో సీఈఓ మహమ్మద్ వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్ రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు మాడుగుల రమేష్, నాయిని రంజిత్, దొంగల రమేష్, చెట్టుపల్లి మురళి, నరసింహారావు, ఎర్రబెల్లి గోపాలరావు, కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఎ.రాజేశ్వర్ రెడ్డి, చాపల యాదగిరి రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, పోలేపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమే కీలకం

- హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీవాస్తవ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ చేతన్‌శ్రీవాస్తవ

కేయూ క్యాంపస్: మానవాభివృద్ధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోందని హైదరాబాద్ యూనివర్సిటీ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలోని కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'ఫినిటిక్ రెవల్యూయేషన్ రీషేపింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇన్‌ది డిజిటల్ ఏజ్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించే జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఫినెక్టివ్ విప్లవం రూపాంతరం చెందిందన్నారు. ఆర్థిక సేవలు పూర్తిగా డిజిటలైజేషన్ అయ్యాయన్నారు. వరంగల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ డైరెక్టర్ కశ్యప్‌నరేష్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా ముందుకెళ్తున్నారన్నారు. ఓయూ ప్రొఫెసర్ నరేష్ మాట్లాడుతూ ఒకప్పుడు బ్యాంకులు తమ సేవలను మాన్యువల్ విధానంలో కొనసాగించేవని, ప్రస్తుతం డిజిటల్ విధానంలో అందిస్తున్నాయన్నారు. కేయూ కామర్స్ అండ్‌బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి అమరవేణి మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్‌తో ముడిపడి ఉందన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి మాట్లాడుతూ ప్రపంచీకరణ ,సరళీకరణ విధానాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం కొనసాగుతోందని, ఇది ఆధునిక సాంకేతికపరిజ్ఞానంతో సాధ్యమైందన్నారు. ఈసదస్సులో సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మాదాసి కనకయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి వరలక్ష్మి, ప్రొఫెసర్ కె రాజేందర్,డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ ఆర్ ఆదిరెడ్డి, హరికుమార్ , తదితరులు పాల్గొన్నారు.